# ప్రభాత ఉదయం

తెలుగు దినపత్రిక



## నారీ శక్తి కొత్త శిఖరాలను తాకుతుంది

మన్ కీ బాత్ 110వ ఎపిసోడ్‌లో మోదీ

2లో..

సంపుటి: 1 | సంచిక: 322 | పేజీలు: 4 | వెల: రూ.3/- | సోమవారం 26 ఫిబ్రవరి 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్

# సముద్ర గర్భాన ప్రధాని సాహసం

## ద్వారకాలో ప్రత్యేక ప్రార్థనలు





ద్వారక, ఫిబ్రవరి, 25 (ప్రభాత ఉదయం): సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదల గడువు సమీపిస్తోన్న నేపథ్యంలో- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన సొంత రాష్ట్రం గుజరాత్‌లో పర్యటిస్తోన్నారు. వేల కోట్ల రూపాయల విలువ చేసే పలు ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేశారు. మరికొన్నింటిని ప్రారంభించారు. తన రెండు రోజుల పర్యటన సందర్భంగా గుజరాత్‌లో 4,150 కోట్ల రూపాయల విలువ చేసే పలు ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారాయన. తన పర్యటన సందర్భంగా ఈ ఉదయం చారిత్రాత్మక బెట్ ద్వారక ఆలయాన్ని సందర్శించారు ప్రధాని మోదీ. ద్వారక నుంచి 30 కిలోమీటర్ల దూరంలో ఉంటుందీ ఆలయం. ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్‌తో కలిసి ఈ ఆలయాన్నిసందర్శించారు మోదీ. ద్వారకాధీశుడి సేవలో పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కేబుల్ బ్రిడ్జిని ప్రారంభించారు. జాతికి అంకితం చేశారు. ఇదివరకు సిగ్నచర్ బ్రిడ్జిగా గుజరాత్ ప్రభుత్వం పేరు పెట్టింది. దీన్ని మార్చింది కేంద్ర ప్రభుత్వం. సుదర్శన్ సేతుగా నామకరణం చేసింది. బెట్ ద్వారక ఆలయాన్ని సందర్శించడానికి వచ్చే దేశం నలుమూలల నుంచి వచ్చే భక్తులకు మెరుగైన రవాణా వసతిని కల్పించడానికి ఈ బ్రిడ్జిని నిర్మించినట్లు గుజరాత్ ప్రభుత్వం తెలిపింది. దీనివల్ల ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని, పర్యాటకుల సంఖ్య భారీగా పెరుగుతుందని పేర్కొంది. అనంతరం ద్వారక సముద్ర తీరంలో స్కూబా డైవింగ్ చేశారు. శ్రీకృష్ణుడు నిర్మించిన ద్వారక నగరం సముద్ర గర్భంలో మునిగిన చోటికి వెళ్లారు. ప్రార్థనలు చేశారు. నెమలి పింఛాలను అక్కడ వదిలారు. అనంతరం ఈ అనుభవాన్ని ఆయన పంచుకున్నారు. దేశ ఆధ్యాత్మిక, చారిత్రక మూలాలకు వెళ్లొచ్చానని, శ్రీకృష్ణుడితో అనుబంధం ఉన్న పురాతన నగరానికి ఇది కేంద్ర బిందువు అని వ్యాఖ్యానించారు.



### లోక్‌సభ ఎన్నికలు..

## మన్ కీ బాత్‌కు తాత్కాలిక బ్రేక్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి, 25 (ప్రభాత ఉదయం): ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రతి నెలా చివరి ఆదివారం ఆల్ ఇండియా రేడియోలో చేస్తున్న 'మన్ కీ బాత్' కార్యక్రమానికి తాత్కాలిక బ్రేక్ పడింది. రాబోయే లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా మన్ కీ బాత్ కార్యక్రమం వచ్చే మూడు నెలలు ప్రసారం కాదని మోదీ స్వయంగా వెల్లడించారు. మన్ కీ బాత్ 110 ఎపిసోడ్‌లో మోదీ ఈ విషయాన్ని ప్రకటించారు. ఆదివారం ఉదయం మోదీ మాట్లాడుతూ.. 'లోక్‌సభ ఎన్నికల సందర్భంగా వచ్చే మూడు నెలల పాటు మన్ కీ బాత్ ప్రసారాలు ఉండవు' అని ప్రకటించారు. ఎన్నికల అనంతరం ఈ కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందని స్పష్టం చేశారు. 'మన్ కీ బాత్ మూడు నెలల పాటు ఆగిపోవచ్చు. కానీ దేశం సాధించిన విజయాలు మాత్రం ఆగవు. అందువల్ల మన్ కీ బాత్ హ్యాష్‌ట్యాగ్‌తో సమాజం, దేశం సాధించిన విజయాలను సోషల్ మీడియాలో పోస్టు చేస్తూ ఉండండి' అని తన 110 ఎపిసోడ్‌లో మోదీ తెలిపారు. ఎన్నికల అనంతరం 111వ ఎపిసోడ్ ప్రసారం అవుతుందని వెల్లడించారు.



### లాస్య కుటుంబానికి

## కేటీఆర్ పరామర్శ

### అండగా ఉంటానని హామీ

హైదరాబాద్, ఫిబ్రవరి 25 (ప్రభాత ఉదయం): కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత రెండు రోజుల క్రితం పటాన్ చెరు దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. ఆ రోజు అందుబాటులో లేని కేటీఆర్.. ఆమె ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎమోషన్ అయ్యారు. లాస్య రోడ్డు ప్రమాదం లో చనిపోయిన విషయం తెలుసుకొని విస్మయానికి గురి అయ్యానని, ఆరోజు నేను విదేశాల్లో ఉండటం వల్ల రాలేక పోయానని ఆవేదన వ్యక్తం చేశాడు. ఆ అమ్మాయిని గత 10,15 రోజులుగా అనేక ప్రమాదాలు వెంటాడాయని, గత ఏడాది వారి నాన్న ఎమ్మెల్యే సాయన్న చనిపోయారని, ఇప్పుడు ఈమె చనిపోవటం బాధాకరమని కేటీఆర్ అన్నారు. లాస్య కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని, లాస్య నందితను కంటోన్మెంట్ ప్రజలు భారీ మెజారిటీతో ఎమ్మెల్యే గా గెలిపించారని కేటీఆర్ అన్నారు. కేటీఆర్ వెంట మాజీ హోమ్ మంత్రి, ఎమ్మెల్సీ మహమూద్ అలీ, మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు అలా వెంకటేశ్వర్ రెడ్డి, గువ్వల బాల్ రాజ్, స్థానిక బీఆర్ఎస్ నేతలు ఉన్నారు. కేటీఆర్ రాక నేపథ్యంలో కంటోన్మెంట్ కు బీఆర్ఎస్ నేతలు, ప్రజాప్రతినిధులు భారీగా చేరుకున్నారు. కాగా కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత అనుమానాస్పద మృతి నేపథ్యంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు, ఇతర వీఐపీల డ్రైవర్లకు

..మిగతా 2లో

### 6 లోక్‌సభ స్థానాలకు

## అభ్యర్థుల ఖరారు

### తొలి జాబితాలో కీలక నేతలకు నిరాశ



హైదరాబాద్, ఫిబ్రవరి 25 (ప్రభాత ఉదయం): లోక్ సభ ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ.. బీజేపీ దూకుడు పెంచింది. ఇప్పటికే.. క్షేత్రస్థాయిలో కార్యకర్తలను సంసిద్ధం చేస్తున్న కమలం పార్టీ.. ఇప్పుడు ఆరు స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేస్తూ తొలి జాబితాను కూడా విడుదల చేసింది. అయితే.. ఈ ఆరుగురు అభ్యర్థుల్లో.. ముగ్గురు సిట్టింగ్ ఎంపీలే కావటం గమనార్హం. మిగితా స్థానాలకు కూడా పలువురు పేర్లు పరిశీలనలో ఉన్నట్టు తెలుస్తోంది. లోక్ సభ ఎన్నికల కోసం బీజేపీ తెలంగాణ

## గ్రూప్స్ పోస్టుల సంఖ్య పెంచండి

### అసంతృప్తిలో తెలంగాణ నిరుద్యోగులు

### కాంగ్రెస్ సర్కారుకు డిమాండ్ల వెల్లువ

హైదరాబాద్, ఫిబ్రవరి 25 (ప్రభాత ఉదయం): తెలంగాణలో కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల 563 గ్రూప్-1 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. గత ప్రభుత్వం విడుదలచేసిన 503 గ్రూప్-1 పోస్టుల నోటిఫికేషన్‌ను రద్దుచేస్తూ.. తాజాగా 60 పోస్టులను జతచేస్తూ.. కొత్త నోటిఫికేషన్‌ను టీఎస్‌పీఎస్సీ విడుదల చేసింది. ఈ నిర్ణయంపై నిరుద్యోగుల్లో ఆగ్రహజ్వాలలు వ్యక్తమవుతున్నాయి. పలుకారణాల వల్ల రెండుసార్లు నిర్వహించిన ప్రిలిమ్స్ పరీక్ష రద్దయింది. మొదటిసారి పేపర్ లీక్ కారణంగా, రెండోసారి బయోమెట్రిక్ హాజరువల్ల ప్రిలిమ్స్ పరీక్ష రద్దయింది. ఇక సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇటీవల ఏకంగా అప్పటి గ్రూప్-1 నోటిఫికేషన్‌నే రద్దుచేసి.. కేవలం 60 పోస్టులు మాత్రమే పెంచడమేంటని నిలదీస్తున్నారు. గ్రూప్-1లో కేవలం 60 గ్రూప్-1 పోస్టులు పెంచడంపై అశోక్‌నగర్‌లోని అశోకా అకాడమీ యజమాని అశోక్ 'ఎక్స్'లో తీవ్రంగా స్పందించారు. ఈ వీడియో సోషల్ మీడియా వైరల్‌గా మారింది. పోస్టుల సంఖ్య భారీగా పెరుగుతుందని నిరుద్యోగులు సైతం ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఉద్యోగాల కోసమే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని

..మిగతా 2లో




## తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్‌గా కె. శ్రీనివాస్ రెడ్డి



హైదరాబాద్, ఫిబ్రవరి 25 (ప్రభాత ఉదయం): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో తెలంగాణలో ఏర్పడిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం.. దశలవారీగా వివిధ కార్పొరేషన్లు, అకాడమీలకు ఛైర్మన్లను నియమిస్తోంది. ఇటీవలే రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడిగా మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత డాక్టర్ జీ చిన్నారెడ్డిని నియమించింది. శనివారమే ఉత్తర్వులు జారీచేసింది. తాజాగా మరో కీలక నియామకాన్ని చేపట్టింది. తెలంగాణ మీడియా అకాడమీకి కొత్త ఛైర్మన్‌ను ప్రకటించింది. సీనియర్ జర్నలిస్ట్ కే శ్రీనివాస్ రెడ్డి.. మీడియా అకాడమీ ఛైర్మన్‌గా అపాయింట్ అయ్యారు. ఈ మేరకు సాధారణ పరిపాలన మంత్రిత్వ శాఖ ప్రత్యేక కార్యదర్శి ఎం హనుమంతరావు ఉత్తర్వులు జారీ చేశారు. రెండు సంవత్సరాల పాటు శ్రీనివాస్ రెడ్డి ఈ హోదాలో కొనసాగుతారు. ఇదివరకు తెలంగాణ ప్రెస్ అకాడమీ ఛైర్మన్‌గా సీనియర్ జర్నలిస్ట్ అల్లం నారాయణ పని చేశారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించినప్పటి నుంచి మొన్నటి వరకు ఆయనే ఆ స్థానంలో కొనసాగారు. అప్పటి భారత్ రాష్ట్ర సమితి ప్రభుత్వం.. ఆయనను అకాడమీ ఛైర్మన్‌గా నియమించిన విషయం తెలిసిందే. గత ఏడాది జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోయింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. దీనితో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో చోటు చేసుకున్న వివిధ కార్పొరేషన్లు, అకాడమీల ఛైర్మన్లు, డైరెక్టర్లు తమ పదవులకు రాజీనామాలు చేశారు. స్వచ్ఛందంగా తమ పదవులను వదులుకున్నారు. వారి రాజీనామాలతో ఖాళీ అయిన స్థానాలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం భర్తీ చేస్తోంది. ఈ క్రమంలో తెలంగాణ మీడియా అకాడమీ ఛైర్మన్‌గా కే శ్రీనివాస్ రెడ్డిని నియమించింది. వివిధ దినపత్రికల్లో ఎడిటర్ హోదాలో పని చేశారు. గతంలో ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ ప్రధాన కార్యదర్శిగా పని చేశారు.



## నోటీసులు రద్దు చేయండి

### లేదంటే ఉపసంహరించుకోండి

### సీబీఐకి ఎమ్మెల్సీ కవిత లేఖ

హైదరాబాద్, ఫిబ్రవరి 25 (ప్రభాత ఉదయం): సీఆర్పీసీ సెక్షన్ 41 కింద జారీ చేసిన నోటీసులు రద్దయినా చేయాలని లేదంటే ఉపసంహరించుకోవాలని సీబీఐని నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కోరారు. ఈ మేరకు ఆమె ఆదివారం సీబీఐకి లేఖ రాశారు. ఒకవేళ నా నుంచి సీబీఐకి ఏవైనా ప్రశ్నలకు సమాధానం, సమాచారం కావాలనుకుంటే వర్చువల్ పద్ధతిలో హాజరయ్యేందుకు అందుబాటులో

..మిగతా 2లో

## బాణసంచా ఫ్యాక్టరీలో పేలుడు..

### ఎనిమిదిమంది మృతి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి, 25 (ప్రభాత ఉదయం): ఉత్తరప్రదేశ్‌లోని కౌశాంబి జిల్లాలోని ఓ బాణసంచా ఫ్యాక్టరీలో భారీ పేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో ఇప్పటి వరకు ఎనిమిది మృతదేహాలు లభ్యమైనట్లు ప్రాథమిక

..మిగతా 2లో



# గ్రూప్స్ పోస్టుల సంఖ్య పెంచండి

మొదటి పేజీ తరువాయి...

తెచ్చుకున్నామని.. తమను మోసం చేయవద్దని అన్నారు. 60 పోస్టులు పెంచి తమకు ఎందుకు బిచ్చం వేస్తున్నారని ప్రభుత్వాన్ని నిలదీశారు. గ్రూప్-1 ఖాళీలను కనీసం 250 నుంచి 300కు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. ఇక గ్రూప్-2 పోస్టులు 2000, గ్రూప్-3 పోస్టులు 3000కు నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యోగాల భర్తీ చేపట్టలేకపోయిందని, నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం చేసిందని గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓడించి కాంగ్రెస్ పార్టీని గద్దెనెక్కించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడునెలలు గడిచింది. ఈ కాలంలో గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన పోలీసు ఉద్యోగాల భర్తీ, గురుకుల ఉద్యోగాలు, స్టాఫ్ నర్స్ పోస్టలకు సంబంధించి ఉద్యోగ పరీక్షలు ముగియగా.. ఫలితాలను విడుదల చేసి, నియామక పత్రాలు అందజేసి, వాటిని కూడా తమ ఖాతాలో వేసుకుంది కాంగ్రెస్ ప్రభుత్వం. మరోవైపు అప్పటి నోటిఫికేషన్లను రద్దుచేస్తూ.. వాటికి కొన్ని పోస్టులను జతచేసి కొత్త నోటిఫికేషన్ విడుదల చేస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పగ్గాలు చేపట్టాక కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టింది. టీఎస్‌పీఎస్సీ కమిషన్ ప్రక్షాళనతోపాటు, యూనివర్సిటీ వీసీల నియామకాలు మాత్రమే చేపట్టింది. అది పదుల సంఖ్యలో ఖాళీల భర్తీ మాత్రమే.

రెండు సార్లు గ్రూప్ 1 నోటిఫికేషన్ రద్దు..

తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక ఇప్పటివరకూ ఒక్కసారి కూడా గ్రూప్ 1 పోస్టులు భర్తీ కాలేదు. రెండు సార్లు నోటిఫికేషన్ ఇచ్చినప్పటికీ, భర్తీ ప్రక్రియ మాత్రం సజావుగా సాగలేదు. మొదట 2022 ఏప్రిల్ లో 503 గ్రూప్ 1 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. కానీ ప్రిలిమ్స్ నిర్వహణ జరిగి, ఫలితాలు సైతం విడుదలయ్యాయి. మెయిన్స్ పరీక్షలు నిర్వహిస్తారని అంతా అనుకుంటున్న సమయంలో ప్రిలిమ్స్ ఎగ్జామ్ పేపర్ లీక్ అయ్యిందని ఆరోపణలు రావడంతో మొదట ప్రిలిమ్స్ ఎగ్జామ్ రద్దు చేశారు. దాంతో గ్రూప్ 1 నోటిఫికేషన్ తొలిసారి రద్దయింది.


అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం రెండోసారి గ్రూప్ 1 ప్రిలిమినరీ ఎగ్జామ్ నిర్వహించింది. తొలిసారి ఎగ్జామ్ నిర్వహించిన సమయంలో బయోమెట్రిక్ లాంటి విషయాలతో పాటు ఎంతో జాగ్రత్తగా ఎగ్జామ్ నిర్వహించారు. కానీ రెండోసారి నిర్వహించిన ఎగ్జామ్ లలో అవకతవకలు జరిగాయని, నిబంధనలు సరిగ్గా పాటించలేదని గ్రూప్ 1 (%+తీశీబజూ% 1) ప్రిలిమినరీ మరోసారి రద్దు చేసింది టీఎస్‌పీఎస్సీ. విషయం హైకోర్టు వరకు వెళ్లడంతో ఎగ్జామ్ రద్దు నిర్ణయాన్ని సమర్థించింది. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం హైకోర్టు నిర్ణయాన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టును సైతం ఆశ్రయించింది. కేసు విచారణలో ఉండగానే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు జరిగి, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది.



# నోటీసులు రద్దు చేయండి

మొదటి పేజీ తరువాయి...

ఉంటానన్నారు. ముందే నిర్ణయించిన కార్యక్రమాలు ఉన్న రీత్యా ఈ నెల 26న విచారణకు హాజరుకావడం సాధ్యం కాదన్నారు. సీఆర్పీసీ సెక్షన్ 41ఏ కింద నోటీసులు ఇవ్వడం సబబు కాదన్నారు. 2022 డిసెంబర్‌లో అప్పటి ఐవో ఇదే తరహా నోటీసును సెక్షన్ 160 కింద ఇచ్చారన్నారు. గతంలో జారీ చేసిన సెక్షన్ 160 నోటీసుకు ప్రస్తుత సెక్షన్ 41ఏ నోటీసు పూర్తి విరుద్ధంగా ఉందన్నారు. సెక్షన్ 41ఏ కింద ఎందుకు, ఏ పరిస్థితుల్లో నోటీసులు ఇచ్చారో స్పష్టత లేదన్నారు. నోటీసు జారీ చేసిన సందర్భం కూడా ఆలోచింపజేస్తున్నదన్నారు. పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో నోటీసులు జారీ చేయడం అనేక ప్రశ్నలకు తావునిస్తోందన్న కవిత.. నాకు ఎన్నికల ప్రచార బాధ్యతలు ఉన్నందున ఢిల్లీకి పిలవడం అనేది ఎన్నికల ప్రక్రియలో పాల్గొనకుండా అవరోధం కలిగిస్తుందని పేర్కొన్నారు. ఇది నా ప్రజాస్వామిక, రాజ్యాంగ హక్కులకు భంగం కలిగిస్తుందన్నారు. సీబీఐ చేస్తున్న ఆరోపణల్లో నా పాత్ర లేదని.. పైగా కేసుకోర్టులో పెండింగ్‌లో ఉందని గుర్తు చేశారు. ఈడీ నోటీసులు జారీ చేయగా తాను సుప్రీం కోర్టును ఆశ్రయించానని తెలిపారు. ఆ కేసు సుప్రీం కోర్టులో పెండింగ్‌లో ఉన్నందున.. తనను విచారణకు పిలవబోమని అదనపు సొలిసిటర్ జనరల్ సుప్రీం కోర్టుకు హామీ ఇచ్చారని ప్రస్తావించారు. సుప్రీంకోర్టులో హామీ సీబీఐకి కూడా కూడా వర్తిస్తుందని.. గతంలోనూ సీబీఐ బృందం హైదరాబాద్‌లోని తన నివాసానికి వచ్చినప్పుడు విచారణకు సహకరించానని తెలిపారు. నియమ నిబంధనలను కట్టుబడి ఉండే దేశ పౌరురాలిగా సీబీఐ దర్యాప్తునకు ఎప్పుడైనా తప్పకుండా సహకరిస్తానన్నారు. కానీ, 15 నెలల విరామం తర్వాత ఇప్పుడు పిలవడం, సెక్షన్ల మార్పు అనేక అనుమానాలకు తావిస్తుందంటూ అనుమానం వ్యక్తం చేశారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో తమ పార్టీ కొన్ని బాధ్యతలు అప్పగించిందని.. రానున్న ఆరు వారాల పాటు రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల ప్రచారం, సమావేశాల షెడ్యూల్ ఖరారైందని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో రానున్న 6 వారాల పాటు పార్టీ సమావేశాల్లో పాల్గొంటానన్నారు. ఈ క్రమంలో ఫిబ్రవరి 26వ తేదీన విచారణకు హాజరుకాలేనని స్పష్టం చేశారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జారీ చేసిన నోటీసులను నిలిపివేతకు పరిశీలించాలని కోరారు.



## భారత్‌లోనే అత్యంత పొడవైన

# కేబుల్ బ్రిడ్జ్ సుదర్శన్ సేతు

## ప్రారంభించిన ప్రధాని మోదీ

గుజరాత్‌లోని ద్వారకాలో భారత్‌లోనే అత్యంత పొడవైన కేబుల్ బ్రిడ్జ్‌ని ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. ఓఖా, బెయిత్ ద్వారకా ద్వీపాలను కలుపుతూ ఈ వంతెనని నిర్మించారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.979 కోట్లు ఖర్చు చేసింది. మొత్తం 2.3 కిలోమీటర్ల పొడవైన ఈ కేబుల్ బ్రిడ్జ్ నిర్మాణానికి 2017లో ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారు. ఓల్డ్ ద్వారకా, న్యూ ద్వారకాని ఇది అనుసంధానం చేస్తుందని ప్రభుత్వం వెల్లడించింది. నాలుగు లేన్‌లతో ఈ నిర్మాణం చేపట్టారు. 27.20 మీటర్ల వెడల్పుతో రోడ్డు నిర్మించారు. ఫుట్‌పాత్ కోసం 2.50 మీటర్ల వెడల్పుని కేటాయించారు. ఈ ఫుట్‌పాత్‌నీ చాలా ప్రత్యేకంగా తీర్చి దిద్దారు. గోడలపై భగవద్గీత శ్లోకాలు, శ్రీకృష్ణుడి చిత్రాలు పెయింట్ చేశారు. దీన్ని ప్రభుత్వం సుదర్శన్ సేతు అనే పేరు పెట్టింది. ఓఖా పోర్ట్‌కి సమీపంలో ఉన్న శ్రీకృష్ణుడి ద్వారాకాధీష్ ఆలయం ఉంది. ఈ వంతెనను ప్రారంభించిన తరవాత ప్రధాని మోదీ ఈ ఆలయంలో పూజలు నిర్వహించారు. ఆ తరవాత గుజరాత్‌లోని కేబుల్ బ్రిడ్జ్‌ని ప్రారంభించడంపై ప్రధాని మోదీ ఆనందం వ్యక్తం చేశారు. అభివృద్ధి పట్ల ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతకు ఇది నిదర్శనమని వెల్లడించారు. ద్వారకా నగరం నుంచి ద్వారకాధీష్ ఆలయానికి 30 కిలోమీటర్ల దూరం. అయితే...ఇప్పటి వరకూ ఈ ఆలయాన్ని సందర్శించాలంటే పడవల్లోనే వచ్చి పోతుండే వారు. ఇప్పుడు ఈ వంతెన అందుబాటులోకి రావడం వల్ల ఈ సమస్య తీరిపోయినట్టైంది.

## నారీ శక్తి కొత్త శిఖరాలను తాకుతుంది

న్యూఢిల్లీ, ఫిబ్రవరి, 25 (ప్రభాత ఉదయం): భారతదేశ నారీ శక్తి ప్రతి రంగంలో పురోగతిలో కొత్త శిఖరాలను తాకిందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చెప్పారు.మన్ కీ బాత్ 110 వ ఎపిసోడ్ లో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఆదివారం నాడు దేశ ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. దేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో నివసించే మహిళలు కూడ డ్రోన్లను ఉపయోగిస్తున్నారని మోడీ చెప్పారు. ఈ విషయాన్ని ఎవరూ ఊహించి ఉండరన్నారు. ప్రతి గ్రామంలో డ్రోన్ గురించి మహిళల్లో చర్చ జరుగుతున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. నమో డ్రోణ దీదీ, నమో డ్రోణ దీదీ అని అందరి పెదవుల్లో వినిపిస్తుందన్నారు. మెల్‌ఘాట్ టైగర్ రిజర్వ్ సమీపంలోని ఖట్కలీ గ్రామంలో నివసిస్తున్న గిరిజన కుటుంబాలు ప్రభుత్వ సహాయంతో తమ ఇళ్లను హెూం స్టేలుగా మార్చుకున్నాయన్నారు. ఇది వారికి ప్రధాన ఆదాయవనరుగా మారుతుందని మోడీ చెప్పారు. వన్యప్రాణులను సంరక్షించేందుకు టెక్నాలజీని వినియోగిస్తున్నట్టుగా మోడీ గుర్తు చేశారు. ఒడిశాలోని కలహండిలో మేకల పెంపకం గ్రామ ప్రజల జీవనోపాధితో పాటు వారి జీవన ప్రమాణాలను మెరుగుపర్చుకోవడానికి ప్రధాన సాధనంగా మారుతుందని మోడీ తెలిపారు. భారతీయ సంస్కృతి,సంప్రదాయాలను పరిరక్షించేందుకు అసంఖ్యాక ప్రజలు నిస్వార్థంగా కృషి చేస్తున్నారని ప్రజల సహకారాన్ని మోడీ ప్రశంసించారు.జమ్మూ కాశ్మీర్, అరుణాచల్ ప్రదేశ్, కర్ణాటకలలో పౌరుల కృషి ప్రతి ఒక్కరికి స్పూర్తినిస్తుందన్నారు. 2014 అక్టోబర్ 3న మన్ కీ బాత్ కార్యక్రమాన్ని ప్రధాని నరేంద్ర మోడీ ప్రారంభించారు. ప్రతి నెల చివరి ఆదివారం నాడు మన్ కీ బాత్ కార్యక్రమంలో మోడీ పాల్గొంటున్నారు. మహిళలు, యువత, రైతులు సహా దేశంలోని పలువురితో మోడీ మాట్లాడుతున్నారు.100 కోట్ల మంది ప్రజలు కనీసం ఒక్కసారైనా కనెక్ట్ అయ్యారని అధ్యయనాలు చెబుతున్నాయి.



## లాస్య కుటుంబానికి

# కేటీఆర్ పరామర్శ

మొదటి పేజీ తరువాయి...

డ్రైవింగ్ పరీక్షలు నిర్వహించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఇటీవల వీఐపీలకు సంబంధించిన ప్రమాదాలు, కొన్ని ప్రమాదాలు ప్రాణాంతకంగా మారడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఔటర్ రింగ్ రోడ్డుపై జరిగిన రోడ్డు ప్రమాదంలో సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత మృతి చెందడం తాజా ఘటన. విఐపి కార్లు నడిపే డ్రైవర్లందరికీ రవాణా శాఖ డ్రైవింగ్ పరీక్షలు నిర్వహిస్తుందని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. విఐపిలందరికీ సహకరించాలని కోరుతూ లేఖలు పంపుతామని ఆయన పేర్కొన్నారు.

# 6 లోక్‌సభ స్థానాలకు అభ్యర్థుల ఖరారు

మొదటి పేజీ తరువాయి...

సిద్ధమవుతోంది. ఆరుగురు అభ్యర్థులతో తొలిజాబితా విడుదల చేసింది. ప్రస్తుతం ఉన్న నలుగురు సిట్టింగ్ ఎంపీల్లో.. ముగ్గురికి ఈసారి కూడా టికెట్లు ఖరారయ్యాయి. కాగా.. మరో సిట్టింగ్ ఎంపీ సోయం బాపూరావు పేరును మాత్రం బీజేపీ అధిష్ఠానం తొలి జాబితాలో ప్రకటించకపోవటం గమనార్హం. తెలంగాణలో మొత్తం 17 లోక్‌సభ స్థానాలుండగా.. మొదటి జాబితాలో 6 స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసిన బీజేపీ అధిష్ఠానం.. మరో 11 స్థానాల్లో కూడా పలువురి అభ్యర్థుల పేర్లను పరిశీలిస్తోంది. ఇందుకోసం.. ఒక్కో సీటుకు రెండేసి పేర్లతో.. మరో జాబితాను జాబితాను సిద్ధం చేసినట్టు తెలుస్తోంది. అయితే.. ప్రస్తుతం ప్రకటించిన ఆరుగురు అభ్యర్థుల్లో ప్రస్తుతం ఎంపీలుగా ఉన్న కిషన్ రెడ్డి, బండి సంజయ్, ధర్మపురి అరవింద్‌కు మరోసారి అవకాశం ఇచ్చింది. కాగా.. సికింద్రాబాద్ నుంచి కిషన్ రెడ్డి , కరీంనగర్ నుంచి బండి సంజయ్, నిజామాబాద్ నుంచి ధర్మపురి అరవింద్ మరోసారి ఎంపీలుగా బరిలోకి దిగనున్నారు. వీళ్లతో పాటు చేవెళ్ల నుంచి కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఖమ్మం నుంచి డాక్టర్ వెంకటేశ్వరరావు, భువనగిరి నుంచి బూర నర్సయ్య గౌడ్‌కు బీజేపీ అధిష్ఠానం టికెట్లు ఖరారులు చేసింది. ఇదిలా ఉంటే.. మిగతా 11 స్థానాలకు కూడా గెలుపు గుర్రాలనే ప్రకటించాలని బీజేపీ కసరత్తు చేస్తోంది. ఈమేరకు.. ఒక్కో స్థానానికి పరిశీలనలో ఉన్న ఇద్దరు నేతల పేర్లతో మరో జాబితా కూడా సిద్ధం చేసినట్టు తెలుస్తోంది. ఈ క్రమంలోనే.. మహబూబ్‌నగర్ స్థానం నుంచి డీకే అరుణ్, జితేందర్ రెడ్డి, మల్కాజిగిరి నుంచి ఈటల రాజేందర్, మురళీధర్ రావుతో పాటు ప్రైవేట్ విద్యా సంస్థల అధిపతి మల్క కొమురయ్య పేరును కూడా పార్టీ నాయకత్వం పరిశీలిస్తున్నట్టు సమాచారం. వీళ్లతో పాటు అసెంబ్లీ ఎన్నికల్లో దుబ్బాక నుంచి పోటీచేసి ఓడిపోయిన రఘునందనరావుకు కూడా మెదక్ ఎంపీ టికెట్ ఇస్తారని ప్రచారం జరుగుతోంది. అయితే.. ఆదిలాబాద్ నుంచి సిట్టింగ్ ఎంపీ సోయం బాపురావుకు టికెట్ ఇవ్వకపోవటంపై సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. మరి ఆ స్థానంలో కొత్త అభ్యర్థికి సీటు ఇస్తారా.. లేదా సోయం బాపురావుకే ఇంకో అవకాశం ఇస్తారా అన్నది తెలియాల్సి ఉంది.

# బాణసంచా ఫ్యాక్టరీలో పేలుడు.. ఎనిమిదిమంది మృతి

మొదటి పేజీ తరువాయి...

సమాచారం. ఈ ఘటనలో పలువురు తీవ్ర గాయాలపాలయ్యారు. సంఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక యంత్రాలు మంటలను ఆపేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయి. ఈ ఘటన జిల్లాలోని కోఖ్‌రాజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని భర్వారీ పట్టణంలో చోటుచేసుకుంది. ఇప్పటి వరకు ఫ్యాక్టరీలో చిక్కుకున్న 10 మంది బాధితులను సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. వీరి పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు సమాచారం. ఫ్యాక్టరీలో ఇంకా ఎనిమిది మంది చిక్కుకున్నారని స్థానికులు అంటున్నారు. ఈ సమాచారం తెలుసుకున్న యూపీ సీఎం యోగి అధికారులను అప్రమత్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని, సహాయక చర్యలను వేగవంతం చేయాలని, క్షతగాత్రులకు తగిన చికిత్స అందించాలని అధికారులకు సీఎం ఆదేశాలు జారీ చేశారు.

# ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం ఎప్పుడు?

## సీఎం రేవంత్‌కి హరీష్ రావు లేఖలో మరిన్ని అంశాలు



హైదరాబాద్, ఫిబ్రవరి 25 (ప్రభాత ఉదయం): గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని ప్రకటించింది. అందుకు సంబంధించి చర్యలు చేపట్టింది. కానీ అంతలోనే ఎన్నికలు జరిగి రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఈ క్రమంలో ఆర్టీసిని ప్రభుత్వంలో విలీనం చేసే 'అపాయింటెడ్ డే' అమలు చేయడంపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. పెరిగిన రద్దీకి అనుగుణంగా కొత్త బస్సుల కొనుగోలు, 2013 పీఆర్సీ బాండ్స్ పేమెంట్ చెల్లించడంపై లేఖలో హరీష్ రావు ప్రస్తావించారు. హరీష్ రావు రాసిన లేఖలో ఏం ప్రస్తావించారంటే.. 'కార్మికులు, ఉద్యోగుల భద్రత, సంస్థ ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని తెలంగాణ ఆర్టీసిని ప్రభుత్వంలో విలీనం చేసేందుకు వీలుగా బి.ఆర్.ఎస్. ప్రభుత్వం అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టి, ఆమోదింప చేయడం తెలిసిందే. గత ఏడాది చివరి అసెంబ్లీ సమావేశాల్లో ఆమోదించిన ఆర్టీసీ విలీన బిల్లును కొన్ని వివరణలు కోరుతూ, గవర్నర్ తమిళిసై మొదట ఆమోదించలేదు. తర్వాత రాష్ట్ర ప్రభుత్వం వివరణ ఇవ్వడంతో పాటు, ఆర్టీసీ కార్మికులతో కలిసి తెచ్చిన వత్తిడి ఫలితంగా గవర్నర్ బిల్లును ఆమోదించారు. శాసనసభ, గవర్నర్ ఆమోదించిన బిల్లును అమలు చేసే 'అపాయింటెడ్ డే' మాత్రమే మిగిలి ఉంది. ఎన్నికల కోడ్ రావడంతో మా ప్రభుత్వం విలీన నిర్ణయాన్ని అమలు చేసే 'అపాయింటెడ్ డే' నిర్వహించలేకపోయింది. ఎన్నికలు పూర్తయిన వెంటనే 'అపాయింటెడ్ డే' అమలు చేస్తామని బి.ఆర్.ఎస్. నాడు స్పష్టం చేసింది. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మానిఫెస్టోలో కూడా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే విలీన బిల్లును అమలు చేసి, ఆర్టీసిని ప్రభుత్వంలో కలుపుతామని, కార్మికులకు ప్రభుత్వమే జీతాలు చెల్లిస్తుందని ఇచ్చిన హామీని నెరవేర్చాలని' బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు ఓ లేఖ ద్వారా సీఎం రేవంత్ దృష్టికి తీసుకొచ్చారు. 'రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడి రెండున్నర నెలలు దాటినా, ఇంత వరకు ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనానికి సంబంధించిన 'అపాయింటెడ్ డే' ప్రకటించలేదనే విషయాన్ని మీ దృష్టికి తెస్తున్నాను. వాస్తవంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం పథకం ప్రారంభించిన నాడే, ఆర్టీసీ విలీనానికి సంబంధించిన జీవో విడుదల చేస్తారని కార్మికులు, ఉద్యోగులు ఆశించారు. కానీ నేటి వరకు విలీనానికి సంబంధించి ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం ప్రవేశ పెట్టిన తర్వాత ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు ముఖ్యంగా మహిళా కండక్టర్లపై పనిభారం చాలా పెరిగింది. బస్సుల్లో ఎక్కువ మంది మహిళలు ఉండడంతో ఓవర్ లోడ్ వెహికిల్ నడపలేక డ్రైవర్లు, కిక్కిరిసిన బస్సుల్లో కలియ తిరుగుతూ టికెట్లు ఇవ్వడానికి కండక్టర్లు ఎంతో శ్రమించాల్సి వస్తున్నది. డ్రైవర్లు ఎక్కువ గంటలు పనిచేయాల్సి వస్తున్నది. వారి అదనపు శ్రమను దృష్టిలో పెట్టుకుని అయినా వెంటనే 'అపాయింటెడ్ డే'ని ప్రకటించి, విలీన జీవో విడుదల చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాను. కనీసం మార్చి నెల నుంచైనా ఆర్టీసీ ఉద్యోగులకు ప్రభుత్వ ఖజానా నుంచి వేతనాలు చెల్లించాలని' తన లేఖ ద్వారా తెలంగాణ ప్రభుత్వాన్ని హరీష్ రావు కోరారు. ప్రయాణీకుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని బి.ఆర్.ఎస్. ప్రభుత్వం 1000 డీజిల్ బస్సులను కొనుగోలు చేయడంతో పాటు, 500 ఎలక్ట్రిక్ బస్సులను కిరాయికి కూడా తెప్పించిందన్నారు. వాటిని కూడా మీరే ఇటీవల ప్రారంభించారు. పెరిగిన మహిళల రద్దీని దృష్టిలో పెట్టుకుని మరో 2000 బస్సులను అదనంగా కొనుగోలు చేయాలని కోరారు. 2013లో జారీ చేసిన పీఆర్సీ బాండ్స్ కు పేమెంటు చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిందన్నారు. మీరు చెప్పిన విధంగానే బాండ్స్ కు అనుగుణంగా నగదు చెల్లింపులు చేయాలని హరీష్ రావు కోరారు. అదనపు బస్సులు సమకూర్చే విషయంలో, పీఆర్సీ బాండ్స్ చెల్లించే విషయంలో మీరే స్వయంగా చొరవ చూపగలరని సీఎం రేవంత్ రెడ్డికి తాజా లేఖ ద్వారా మాజీ మంత్రి హరీష్ రావు విన్నవించారు..

# కాంగ్రెస్‌లో చేరిన జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్

హైదరాబాద్, ఫిబ్రవరి 25 (ప్రభాత ఉదయం): జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత దంపతులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. మోతే శ్రీలత రెడ్డితో పాటు, కార్మిక సంఘం నాయకులు శోభన్ రెడ్డి దంపతులు గాంధీ భవన్ లో ఏఐసీసీ ఇంచార్జి దీపా దాస్ మున్షి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, హైదరాబాద్ పార్లమెంట్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో వీరు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీలో చేరిన జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. టీఆర్ఎస్ పార్టీ కోసం 24 సంవత్సరాలు కష్టపడ్డ వారిని కాకుండా పార్టీకి సంబంధం వ్యక్తులను పదవులు కట్టబెట్టడం సరికాదని వారు మంచి నిర్ణయం తీసుకున్నారని మంత్రి అన్నారు. టీఆర్ఎస్ పేరుతో వచ్చిన బీఆర్ఎస్ పార్టీ అమరుల త్యాగాలపై ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకొని తెలంగాణ ఉద్యమకారులను విస్మరించిందని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలందరిని సంక్షేమ అభివృద్ధి వైపు నడిపించేందుకు కట్టుబడి ఉందని అన్నారు. కాంగ్రెస్ పార్టీలో ప్రతి నాయకుడికి సముచిత స్థానం ఉంటుందని అన్నారు. డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత మాట్లాడుతూ.. "బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావం 2000 సంవత్సరం నుంచి బీఆర్ఎస్ పార్టీలో పనిచేశాను. బీఆర్ఎస్ పార్టీలో ఉద్యమకారులుగా మాకు సరైన న్యాయం జరగలేదు. కాంగ్రెస్ పార్టీలో చేరడం అత్తగారింటి నుండి తల్లి గారి ఇంటికి వచ్చినంత ఆనందం కలిగింది. ఎవరి ఒత్తిడి లేకుండానే ఇష్టపూర్తిగా కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నాను" అని శ్రీలత రెడ్డి అన్నారు. మోతే శోభన్ రెడ్డి మాట్లాడుతూ.. "తెలంగాణ ఉద్యమకారులను మాజీ ముఖ్యమంత్రి పక్కన పెట్టడం రాజీనామా చేయడం జరిగింది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఉద్యమకారులను కాదని ధనబలం ఉన్నటువంటి వ్యక్తులనే ప్రోత్సహిస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమం మా కుటుంబంలో మా తమ్ముడుతో మొదలైంది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్యమకారుల పట్ల తీసుకున్న నిర్ణయం పట్ల విశ్వాసంతో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నాం. ఉద్యమ పార్టీగా తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ ఏర్పడినప్పటికీ ఉద్యమకారులను గుర్తించకపోవడం పట్ల కాంగ్రెస్ వైపు రావడం జరిగింది. కాంగ్రెస్ పార్టీలో ఉంటే ఉద్యమకారులకు గౌరవం దక్కుతుందనే ఉద్దేశంతో పార్టీలో చేరాం. గ్రేటర్ హైదరాబాద్ లో మా తోనే టీఆర్ఎస్ పార్టీ మొదలైంది మాతోనే బీఆర్ఎస్ పార్టీ ముగుస్తుంది" అని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ కాంగ్రెస్ ఫ్లోర్ లీటర్ ధర్పల్లి రాజశేఖర్ రెడ్డి, ఖైరతాబాద్ డిసిసి అధ్యక్షులు రోహిన్ రెడ్డి, కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేన రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ భూమిలో అక్రమంగా బోరు వేయడానికి ప్రయత్నం

## స్థానికుల ఫిర్యాదుతో అడ్డుకున్న రెవెన్యూ అధికారులు
## రెవెన్యూ అధికారుల ఫిర్యాదుతో సంఘటన స్థలానికి పోలీసులు

రాజేంద్రనగర్, ఫిబ్రవరి 25(ప్రభాత ఉదయం) రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని మైలార్ దేవుపల్లి ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 156/1 లో స్థలం ఆక్రమించడానికి ఆదివారం సెలవు కావడంతో ఆక్రమణదారులు పథకం వేశారు. స్థానికులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడంతో అక్కడికి చేరుకొని పనులను నిలిపివేశారు. స్థానికులు ఆర్డీఓ వెంకట్ రెడ్డికి ఫిర్యాదు చేయడంతో ఆయన వెంటనే మైలార్ దేవ్ పల్లి పోలీసులను ఆదేశించడంతో అక్రమంగా ప్రభుత్వ భూమిలో బోరు వేస్తున్న స్థలం ను కాపాడటానికి పనులు నిలిపివేశారు. గత కొంతకాలంగా కోట్లాది రూపాయల విలువచేసే ఈ ప్రభుత్వ భూమిని ఆక్రమించడానికి నకిలీ పత్రాలు సృష్టిస్తూ వివిధ రాజకీయ పార్టీల నాయకులు అమాయకులకు విక్రయిస్తున్నారు. రాజకీయ నాయకులుగా చలామణి అవుతున్న వివిధ పార్టీల నాయకులు ప్రభుత్వ భూమికి నఖిలీ నోటరీ పత్రాలు సృష్టించి లక్షల రూపాయలకు విక్రయించుకుంటూ జేబులో వేసుకుంటున్నారు. మైలార్ దేవ్ పల్లి ప్రభుత్వ భూమి 156/1 లో టీఎన్జీవో లకు నాలుగు దశాబ్దాల క్రితం 300 గజాల చొప్పున ఇళ్ల స్థలాలను ధర నిర్ణయించి కేటాయించారు. ఈ సర్వే నెంబర్ లో సుమారు 30 ఎకరాల ప్రభుత్వ భూమి మిగులు భూమి ఉంది. అయితే ఈ మిగులు భూమి ని ఆక్రమించుకోవడానికి గత కొన్ని ఏళ్లుగా స్థానిక నాయకులు ఆక్రమించి లక్షల రూపాయలకు అమ్ముకుంటున్నారు.


మైలార్ దేవ్ పల్లి సర్వే నంబర్ 156/1 ప్రభుత్వ భూములు బోరు వేస్తున్న ఆక్రమణదారులు


సిఖ్ చావునిలోని గురుద్వార్ లో సిక్కులతో ఎంపీ రంజిత్ రెడ్డి

# గురు హర్రాయి సాహెబ్ జి మహారాజ్ 394 జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎంపీ రంజిత్ రెడ్డి

రాజేంద్రనగర్, ఫిబ్రవరి 25(ప్రభాత ఉదయం) రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని అత్తాపూర్ గురుద్వారా సాహెబ్ సిఖ్ చావనీలో ఆదివారం జరిగిన 7వ సిఖ్ మత గురువు శ్రీ గురు హర్రాయి సాహెబ్ జి మహారాజ్ 394 జయంతి వేడుకల్లో చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు డాక్టర్ గడ్డం రంజిత్ రెడ్డి పాల్గొని ప్రార్థనలు పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ జి రంజిత్ రెడ్డికి సిఖ్ సోదరులు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలోసిఖ్ సోదరులు పాల్గొన్నారు.

# నేడు విద్యుత్ లేని ప్రాంతాలు

రాజేంద్రనగర్, ఫిబ్రవరి 25(ప్రభాత ఉదయం) మైలార్ దేవ్ పల్లి, గ్రీన్ విచ్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో వివిధ మరమ్మత్తుల నిమిత్తం సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీనివాస్ తెలిపారు. ఈ సబ్ స్టేషన్ పరిధిలోని పల్లె చెరువు, గుమ్మడి వెంకట్ రెడ్డి నగర్, మిలాన్ నగర్, ఆలీ నగర్, కింగ్స్ అవెన్యూ, అహ్మద్ నగర్,హాశామాబాద్ ప్రాంతాలలో ఉదయం 10 గంటలనుండి 11 గంటల వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించగలరని ఆయన కోరారు.


విద్యార్థుల రూపొందించిన ప్రదర్శన తిలకిస్తున్న రాజేంద్రనగర్ ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ కమిటీ అధ్యక్షులు ప్రభాకర్ ఆచారి

# విజ్ఞాన ప్రదర్శనలు విద్యార్థులకు భవిష్యత్తులో ఎంతో దోహదం: ప్రభాకరాచారి

## శ్రీ గాయత్రీ ఈ-టెక్నో స్కూల్లో సైన్స్ ప్రదర్శన

రాజేంద్రనగర్, ఫిబ్రవరి 25(ప్రభాత ఉదయం) విజ్ఞాన ప్రదర్శనలు విద్యార్థులకు భవిష్యత్తులో ఎంతో ఉపయోగపడతాయని రాజేంద్రనగర్ మండల ప్రైవేట్ పాఠశాలల గుర్తింపు అసోసియేషన్ అధ్యక్షులు ప్రభాకర చారి అన్నారు. ఆదివారం కాటేదాన్ లోని శ్రీ గాయత్రీ ఈ-టెక్నో పాఠశాలలో సైన్స్ ప్రదర్శనను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయుల సహకారంతో వినూత్న రీతిలో న్యూట్రీషన్ డైట్, సెన్సార్ టెక్నాలజీ, అప్లికేషన్ ఆఫ్ ట్రిగ్నోమెట్రీ, పౌర కుటుంబం టెక్నాలజీ ఇన్ అవర్ లైఫ్, హమారా త్యోహార్, మిద్దెల మీద తోటలు, రైతులు-సైనికులకు వందనాలు, బల రామాయణం, న్యూట్రీషన్ ఆండ్ జంక్ ఫుడ్, రాష్ట్రాలు-సంప్రదాయాలు తదితర ప్రదర్శనలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా రాజేంద్రనగర్ మండల ట్రెస్మ సంస్థ అధ్యక్షులు ప్రభాకరాచారి, కోశాధికారి రజనీకాంత్ లు హజరై సైన్స్ ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభాకర చారి మాట్లాడుతూ... విజ్ఞాన ప్రదర్శనలు విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికి తీయటానికి ఎంతో దోహదపడతాయన్నారు. చిన్న వయసులోని విద్యార్థులు అద్భుతమైన ప్రాజెక్టులను తయారు చేయడంలో విద్యార్థులకు మార్గదర్శకులుగా ఉన్న ఉపాధ్యాయుల బృందాన్ని అభినందదించారు. విద్యార్థులు చిన్న నాటి నుంచే తమలోని నైపుణ్యాలను బయటకు తీయాలన్నారు. ఇలాంటి సైన్స్ ప్రదర్శనల వల్ల విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభ బహిర్గతం అవుతుందన్నారు. రానున్న రోజుల్లో ఇలాంటి మరిన్ని ప్రదర్శనలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ మధుసుధన్, డైరెక్టర్ సమీయుద్దీన్, శ్రీహరి, సీఈవో సర్వేశ్వర్రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# చేవెళ్ల పార్లమెంట్ నుండి అయోధ్యకు తరలిన రామభక్తులు

## రామ భక్తులకు వీడ్కోలు పలికిన బిజెపి నాయకులు

రాజేంద్రనగర్, ఫిబ్రవరి 25(ప్రభాత ఉదయం) చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం లోని వివిధ ప్రాంతాలకు చెందిన రామభక్తులు అయోధ్య రామన్న దర్శించుకోవడానికి ఆదివారం బయలుదేరి వెళ్లారు. అయోధ్యకు బయలుదేరిన రామ భక్తులకు రాజేంద్రనగర్ సర్కిల్ బిజెపి నాయకులు వీడ్కోలు పలికారు. అయోధ్య దర్శన్ అభియాన్ లో భాగంగా శ్రీ రామ భక్తులకు వీడ్కోలు పలికిన వారిలో బిజెపి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహ రెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై శ్రీధర్, జిల్లా కార్యదర్శి యం కొమరయ్య ,జిల్లా కర్యవర్గ సభ్యుడు మూల శ్రీనివాస్ గౌడ్, తదితరులు ఉన్నారు.


అయోధ్య వెళ్తున్న రామ భక్తులకు వీడ్కోలు పలుకుతున్న బిజెపి నాయకులు


సంత్ సేవాలాల్ జయంతి వేడుకల్లో ప్రసంగిస్తున్న మాజీ మంత్రి సబితా రెడ్డి

# గిరిజనుల అభివృద్ధి కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో చేసింది

## మాజీ మంత్రి సబితా రెడ్డి

### సంత్ సేవాలాల్ ఆశయాల కోసం కృషి చేయాలి

### సంత సేవాలాల్ జీవితం స్ఫూర్తిదాయకం..

మహేశ్వరం,ఫిబ్రవరి25(ప్రభాత ఉదయం): సంత్ సేవాలాల్ జీవితం స్ఫూర్తిదాయకమని, ఆయన చూపిన మార్గం అందరికీ అనుసరణీయమని మాజీ మంత్రి,మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి అన్నారు. బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గుర్రంగూడ జీపీఆర్ కన్వెన్షన్ హాల్‌లో గుర్రంగూడ సంత్ సేవాలాల్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ...సంత్ సేవాలాల్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు. గిరిజనుల అభివృద్ధి కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో చేసిందన్నారు.తండాలను గ్రామ పంచాయతీలుగా చేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కిందన్నారు.గత ఎన్నికల్లో సైతం తండాలకు చెందిన ప్రజలంతా తనకు ఓట్లువేసి మెజార్టీ ఇచ్చారని,తండాల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.మహేశ్వరం నియోజకవర్గంలో సేవాలాల్ మందిరానికి స్థలం కెటాయించామని వెల్లడించారు. మహనీయుల ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు.సేవాలాల్ చరిత్రను రేపటి తరాలకు తెలియజేయవలసిన అవసరం ఉందన్నారు.బంజారాల ఆరాధ్య దైవమైన సంత్ శ్రీసేవాలాల్ మహరాజ్ ఆశయ సాధనకు కృషి చేయాలని సూచించారు.వ్యసనాలకు,దురలవాట్లకు దూరంగా ఉంటూ,సమాజ హితానికి పాటుపడాలని సేవాలాల్ మహరాజ్ చేసిన బోధనలు ఎంతో మందిని ప్రభావితం చేసి సన్మార్గంలో నడిపించాయన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బాలు నాయక్,మేయర్ చిగిరింత పారిజాత నర్సింహరెడ్డి,డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్,కార్పొరేటర్లు లక్ష్మరెడ్డి,శంకర్,ఏనుగు రాంరెడ్డి,బీమిడి జంగారెడ్డి,సంరెడ్డి వెంకట్‌రెడ్డి,అశోక్ పాల్గొన్నారు.

# గుర్రం జాషువా స్మారక కళా పరిషత్ జంటనగరాల కన్వీనర్‌గా వేము వందనం

బుద్వేల్, ఫిబ్రవరి25(ప్రభాత ఉదయం): పద్మభూషణ్ గుర్రం జాషువా స్మారక కళా పరిషత్ జంటనగరాల కన్వీనర్ గా ప్రముఖ సాహితీవేత్త, రంగస్థలం నటుడు, రాజేంద్రనగర్ సర్కిల్ భవాని కాలనీ వాస్తవ్యులు వేము వందనం నియమితులైనారు. ఈ మేరకు సంస్థ ప్రతినిధులు డాక్టర్ పెద్దిటి యోహాను, డాక్టర్ కొత్తపల్లి రాజ్ కుమార్, డాక్టర్ రంగిశెట్టి రమేష్, తదితరులు నియామక పత్రాన్ని అందజేశారు. వేము వందనం మాట్లాడుతూ 50 సంవత్సరాల కళా జీవితంలో ఎన్నో అవార్డులు పొందానన్నారు. రంగస్థల నటుడిగా, సాహితీవేత్తగా, కవిగా తనకు తెలుగు రాష్ట్రాల ప్రజలు సాహితీ ప్రేమికులు అందిస్తున్న ఆదరాభిమానాలకు సదా కృతజ్ఞుడుగా ఉంటారన్నారు.


వేము వందనం


వనం శ్రీరామ్ రెడ్డి, భంగి శ్రీనివాస్ లను సన్మానిస్తున్న నిర్వాహకులు

# హుడా కాలనీలో ఉచిత వైద్య శిబిరం

బుద్వేల్, ఫిబ్రవరి25(ప్రభాత ఉదయం) : అత్తాపూర్ డివిజన్ హుడా కాలనీలో ఆదివారం యోధ లైఫ్ లైన్ డయాగ్నస్టిక్స్ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైద్యం చాలా ఖరీదైన పరిస్థితిలో యోధ డయాగ్నస్టిక్స్ సంస్థ ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులను పంపిణీ చేయడం సంతోషకరమైన విషయం అన్నారు . ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు . ఈ కార్యక్రమంలో నాయకులు బంగి శ్రీనివాస్ , శివ కుమార్, భరత్ సారంగి, శంకర్, మహేందర్ రెడ్డి, రితీష్, గంగాధర్, డాక్టర్లు సీమా సోనీ, వీణా గోయల్, దీపక్ గోయల్ లు పాల్గొన్నారు. కొలెస్ట్రాల్ , బీపీ, షుగర్, బాడీ ఫ్యాట్, బి ఎం ఆర్ పరీక్షలను నిర్వహించారు.


వైద్య పరీక్షలు చేయించుకుంటున్న వనం శ్రీరామ్ రెడ్డి

# వ్యవసాయ వర్సిటీ బోధనేతర సిబ్బంది క్రీడా పోటీలు ప్రారంభం


క్రికెట్ ఆడటానికి సిద్ధంగా ఉన్న ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉద్యోగులు


క్రికెట్ ఆడుతున్న ఉద్యోగులు

బుద్వేల్, ఫిబ్రవరి25(ప్రభాత ఉదయం) : ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం బోధనేతర ఉద్యోగుల క్రీడా పోటీలు ఆదివారం రాజేంద్రనగర్ లో ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను వర్సిటీ డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ జెల్లా సత్యనారాయణ, రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్, వర్సిటీ పాలకమండలి సభ్యులు డాక్టర్ సి నరేందర్ రెడ్డి లు ప్రారంభించారు. మూడు రోజులపాటు రాజేంద్రనగర్ లోని స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో జరగనున్న క్రీడలు, సాంస్కృతిక , సాహిత్య పోటీలలో రాష్ట్రంలోని నాలుగు జోన్ల నుంచి 110 మంది బోధనేతర సిబ్బంది పాల్గొంటున్నారు. మూడు రోజులపాటు జరిగే ఈ క్రీడా పోటీలలో 23 రకాల క్రీడా, సాంస్కృతిక, సాహిత్య పోటీలు ఉంటాయని డాక్టర్ జెల్లా సత్యనారాయణ, డాక్టర్ సి. నరేందర్ రెడ్డి లు తెలిపారు. విధి నిర్వహణలో నిత్యం బిజీగా ఉండే బోధనేతర సిబ్బందికి ప్రోత్సాహం అందించి, వారు ఆరోగ్యంగా ఉండడానికి ప్రతి సంవత్సరం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉద్యోగులకు క్రీడా పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. క్రీడల ద్వారా ఆరోగ్యం అని గుర్తు చేశారు. ఉద్యోగులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే చురుకుగా పని చేస్తారని అందుకే క్రీడా పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రజా సంబంధాల అధికారి డాక్టర్ వన్నోజ్ సుధాకర్ , వర్సిటీ లైబ్రేరియన్ డాక్టర్ ఎన్ పి రవికుమార్ తో పాటు ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ద్రాక్ష తోటలో కొనుగోలుదారుల సందడి

బుద్వేల్, ఫిబ్రవరి25(ప్రభాత ఉదయం) : రాజేంద్రనగర్ లోని ద్రాక్ష పరిశోధన కేంద్రంలో ద్రాక్ష మేళా కొనసాగుతుంది. ఆదివారం కావడంతో ద్రాక్ష పండ్లను కొనుగోలు చేయడానికి పెద్ద సంఖ్యలో కొనుగోలు దారులు తోటకు వచ్చారు. ద్రాక్ష పండ్లను చెట్ల పైనే రుచి చూసి కొనుగోలు చేసే అవకాశం ఉండడంతో ప్రజలు ద్రాక్షతోటకు వచ్చి రకరకాల ద్రాక్షలను కొనుగోలు చేస్తున్నారు. శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలోని రాజేంద్రనగర్ ఉద్యాన కళాశాల కు చెందిన ద్రాక్ష పరిశోధన కేంద్రంలోని 62 రకాల ద్రాక్ష పండ్లు అందుబాటులో ఉన్నాయి. తోట నిర్వాహకులు మంగళవారం కార్తీక్ ఆధ్వర్యంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ప్రతిరోజు తోటకు వచ్చే వారి కోసం మేళాను ఏర్పాటు చేశారు.


ద్రాక్ష తోటలో కొనుగోలు దారులు




ద్రాక్ష పండ్లు

# ఏడేళ్ల తర్వాత ఒకే వేదికపైకి ముఖ్యనేతలు.. ఏకం చేసిన యాత్ర

ఆగ్రా, ఫిబ్రవరి 25(ప్రభాత ఉదయం) కాంగ్రెస్ ముఖ్యనేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో న్యాయ్ యాత్ర ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రాకు చేరుకుంది. ఉత్తరప్రదేశ్‌లో యాత్ర చివరి రోజున ఇద్దరు ముఖ్య రాజకీయ నేతలు రాహుల్ గాంధీ, అఖిలేష్ యాదవ్ హాజరయ్యారు. ఏడేళ్ల తర్వాత రాహుల్ గాంధీ, అఖిలేష్ యాదవ్‌లు ఒకే వేదికపై కనిపించారు. కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ భారత్ జోడో న్యాయ్ యాత్రకు సమాజ్ వాదీ పార్టీ జాతీయ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ మద్దతు పలికారు. ఆగ్రాలో పర్యటిస్తున్న రాహుల్ గాంధీకి మద్దతుగా అఖిలేష్ బలప్రదర్శన కనిపించింది. పెద్ద సంఖ్యలో ఎస్పీ కార్యకర్తలు కూడా హాజరయ్యారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం ఇరువురు నేతలు పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. రాజ్యాంగాన్ని రక్షించడం, బిజెపిని తొలగించడం, దేశాన్ని రక్షించడం మా పోరాటమన్నారు. ఉత్తరప్రదేశ్‌లో బీజేపీకి చెందిన 80 మంది ఎంపీలను ఓడించినప్పుడే మన పోరాటం విజయవంతమవుతుందన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వేదికపై రాహుల్‌తో పాటు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ కూడా పాల్గొన్నారు. రాహుల్ గాంధీ న్యాయ్ యాత్ర మిత్రపక్షాల మద్దతు కోసం చాలా కాలంగా వేచి ఉంది. రాహుల్ తన న్యాయ్ యాత్రతో పశ్చిమ బెంగాల్ చేరుకున్నప్పుడు, మమతా బెనర్జీ షాక్ ఇచ్చి యాత్రకు



దూరంగా ఉన్నారు. యాత్ర బెంగాల్ నుంచి బీహార్‌కు చేరుకోగానే నితీష్ కుమార్ కూటమి మారి మళ్లీ బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయేలో చేరి రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. రాహుల్ బీహార్ నుండి ఉత్తరప్రదేశ్ వెళ్లినప్పుడు, అఖిలేష్ యాదవ్ రాహుల్ యాత్రలో పాల్గొంటారనే గ్యారెంటీ లేదు. ఎందుకంటే సీట్ల పంపకం పూర్తయిన తర్వాతే తాను భారత్ జోడో న్యాయ యాత్రలో చేరతానని అఖిలేష్ యాదవ్ స్వయంగా ప్రకటించారు. దీంతో ఇండియా అలయన్స్‌లో ఉన్న పార్టీల మధ్య పొగమంచు కమ్ముకోవడం ప్రారంభించింది. కాంగ్రెస్‌కు చెందిన సమాజ్‌వాదీ పార్టీతో పాటు, ఆమ్ ఆద్మీ పార్టీతో కూడా చర్చలు ప్రారంభమయ్యాయి. అటువంటి పరిస్థితిలో, రాహుల్ గాంధీ భారత్ జోడో న్యాయ్ యాత్ర ఆగ్రాకు చేరుకుంది. ఇందులో సమాజ్ వాదీ పార్టీకి చెందిన అఖిలేష్ యాదవ్ కూడా పాల్గొన్నారు. రాహుల్, అఖిలేష్, ప్రియాంకల రోడ్ షో తర్వాత సంయుక్త సమావేశం నిర్వహించారు. చూస్తుంటే, దాదాపు ఏడేళ్ల తర్వాత యూపీకి చెందిన ఇద్దరు కుర్రాళ్లు అఖిలేష్ యాదవ్, రాహుల్ గాంధీ మరోసారి ఒకే వేదికపై కనిపించారు. గతంలో 2017 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, సమాజ్ వాదీ పార్టీలు కలిసి పోటీ చేసినా తమ సత్తా చాటలేకపోయాయి. ఇక 2024 ఎన్నికలకు ముందు రాష్ట్రీయ లోక్ దళ్ అధ్యక్షుడు జయంత్ చౌదరి ఎన్డీయేతో కలిసి వెళ్లాలని నిర్ణయించుకున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పాట్నా, బెంగళూరు, ముంబై, ఢిల్లీలో జరిగిన భారత కూటమి నాలుగు సమావేశాలకు హాజరైన తర్వాత ఆర్ఎల్‌డీ పార్టీ ఎన్‌డీఏలో చేరినప్పటికీ, ఈ ఉదయం అసలు పార్టీ స్థాపించింది భారతరత్న చౌదరి చరణ్ సింగ్ లోక్ దళ్ అని కాంగ్రెస్ వైపు వెళ్తున్నట్లు పార్టీ నేతలు చెప్పుకొచ్చారు. ఈ క్రమంలోనే కార్యకర్తలు, నాయకులు భారత్ జోడో న్యాయ్ యాత్రకు, రాహుల్ గాంధీకి ఎంతో ఉత్సాహంతో స్వాగతం పలికారు.



బదిలీ అయిన ఎక్సైజ్ సీఐ ఓంకార్ ని సన్మానిస్తున్న ఎమ్మెల్యే జీఎంఆర్


## అధికారులు విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా పని చేయాలి: ఎమ్మెల్యే జిఎంఆర్

### బదిలీ అయిన ఎక్సైజ్ సీఐ ఓంకార్‌కు సన్మానం

కొత్త కోట, ఫిబ్రవరి 25(ప్రభాత ఉదయం) కొత్తకోట ఎక్సైజ్ సీఐ ఓంకార్ పనిచేసే ఉప్పల్ కి బదిలీపై వెళ్తున్న సందర్భంగా సన్మానించారు. ఆదివారం జరిగిన ఎక్సైజ్ సీఐ ఓంకార్ సన్మాన కార్యక్రమంలో దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జిఎంఆర్ పాల్గొని శాలువా తో సత్కరించారు. ఈ సందర్భంగా దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ ... అధికారులు విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన నాయకులు

**కొత్తకోట, ఫిబ్రవరి 25(ప్రభాత ఉదయం) మదనాపురం మండలంలోని అజ్జాకోలు గ్రామానికి చెందిన అయ్యగారి బాలకృష్ణారెడ్డి, సుజాత దంపతుల కుమారుడు హర్షవర్ధన్ రెడ్డి, మల్లిక ల వివాహం ఘనంగా జరిగింది. ఆదివారం కొత్తకోట పట్టణంలోని ఆర్ కె గార్డెన్ ఈ రిసెప్షన్ కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ సీనియర్ నాయకులు మూలమల్ల భీమ్ రెడ్డి, నాయకులు రవికుమార్ రెడ్డి, వహీదులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.**



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న నాయకులు



కరాటే పోటీలలో పాల్గొన్న చిన్నారులు

## కరాటే ఆత్మ రక్షణకు..ఆరోగ్యానికి అవసరం

గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 25(ప్రభాత ఉదయం)కరాటే తో ఆరోగ్యంతో పాటు ఆత్మరక్షణ ఆత్మస్థైర్యం పెరుగుతుందని ఇది ఆడపిల్లలకు ఎంతగానో మనోధైర్యాన్ని ఇస్తుందని తైక్వాండో రాష్ట్ర అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీహరి అన్నారు. ఆదివారం గద్వాల పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో జరిగిన కరాటే విద్యార్థుల బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ విన్యాసం,కరాటే బెల్టులు పంపిణికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కరాటే పోటీలకు అంతర్జాతీయ స్థాయిలో ప్రాధాన్యత లభించిందని ఒలంపిక్ లో కరాటేకు ప్రత్యేక ప్రాధ్యాన్యత లభించిందని బాలికలు సైతం కరాటే పోటీలు నేర్చుకోవడానికి ముందుకు రావడం శుభ పరిణామమని మహిళల ఆత్మ రక్షణకు కరాటే ఒక వరంలా పనిచేస్తుందని అన్నారు. అనంతరం కరాటే లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బెల్టులను ప్రధానం చేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో తైక్వాండో మాస్టర్ శ్రీనివాస్, రాజేశ్వరీ, విద్యార్థులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న జెడ్ పి చైర్మన్ సరిత

## ప్రభుత్వ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తాం: జెడ్ పి చైర్మన్ సరిత

గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 25(ప్రభాత ఉదయం)ప్రభుత్వ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తామని జెడ్పీ చైర్ పర్సన్ సరిత అన్నారు. టిఎస్ యుటిఎఫ్ జిల్లా కమిటీ విస్తృత సమావేశం కె.తిప్పన్న అధ్యక్షతన అదివారం గద్వాల పట్టణంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జెడ్పీ చైర్ పర్సన్ సరిత హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... విద్యలో వెనకబడి పోవడానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వ తప్పిదాలే కారణమేనని, పాఠశాల లో కనీస మౌలిక వసతులు కల్పించలేక పోయాయని విమర్శించారు. పాఠశాలలో స్కావెంజర్స్ ని తొలగించి పారిశుధ్యం గాలికి వదిలేశాయని మండిపడ్డారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో విఫలమవ్వడంతో పాటు పూర్తిగా భ్రష్టు పట్టించిందని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి 317 జీఓలో నష్టపోయిన ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో వాయిస్ ఆఫ్ తెలంగాణ సంపాదకులు మాణిక్య రెడ్డి, కాంగ్రెస్ నాయకులు మధుసూదన్ బాబు, టిఎస్ యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి గోపాల్, జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్, కోశాధికారి చక్రధర్, సీనియర్ నాయకులు రామన్ గౌడ్, స్వామి జిల్లా కార్యదర్శులు రమణ, చంద్రకాంత్, బీసన్న, కుమార్ నాయుడు,రాజశేఖర్, తిమప్ప,హుస్సేన్, తిలక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పాదయాత్రలో సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్

## ప్రజలకు పూర్తిస్థాయి మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

### కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్

**సీసీ రోడ్డును పరిశీలించిన కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్**

కూకట్‌పల్లి,ఫిబ్రవరి 25 (ప్రభాత ఉదయం) ఎల్లమ్మబండ పరిధిలోని ఎన్టీఆర్ నగర్ మసీదు వద్ద సీసీ రోడ్ల కొరకు గతంలో పదిహేడు లక్షల రూపాయల నిధులు మంజూరై, ఇప్పుడు నిర్మాణ పనులు పూర్తయిన నూతన సీసీ రోడ్డును ఆదివారం డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ రోడ్డుకు ఇరువైపులా అంచుల వద్ద మట్టి వేయాలని, అలాగే మంచిగా క్యూరింగ్ చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో శివరాజ్ గౌడ్, మల్లేష్, నరసింహులు, నాగరాజు, ఉమేష్, తదితరులు పాల్గొన్నారు.



## ప్రతి ఒక్కరూ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలి

### కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి.జగదీశ్వర్ గౌడ్

**బిఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్‌లో చేరికలు**

కూకట్‌పల్లి,ఫిబ్రవరి 25 (ప్రభాత ఉదయం) పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం పార్టీ శ్రేణులు శక్తిగాంచిన లేకుండా కృషి చేయాలని శేరి లింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జగదీశ్వర్ గౌడ్ సూచించారు. ఆదివారం నియోజకవర్గంలోని వివేకానంద నగర్ డివిజన్ వెంకటేశ్వర నగర్ కు చెందిన పలువురు బిఆర్ఎస్ పార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి.జగదీశ్వర్ గౌడ్ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన నాయకులు జితేంద్ర చారి, నారాయణ, నాగార్జున, ఎం.పరమేశ్వర చారి, నాగరాజు, ప్రభాకర్, సంతోష్, రంగారావు, నాగ సుబ్రహ్మణ్యం పలుగురికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ... ప్రతి కార్యకర్త రానున్న ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపుకు ఒక్క సైనికుడిలా పనిచేసి కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అన్ని వర్గాల అభ్యున్నతకు అడుగులు ముందుకు వేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వివేకానంద నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బాషిపాక యాదగిరి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఆస్కాని వెంకటస్వామి సాగర్, అంజలి తదితరులు పాల్గొన్నారు.



సీనియర్ సిటిజన్స్ నూతన కార్యవర్గం



జి సత్యనారాయణ జన్మదిన సందర్భంగా సన్మానిస్తున్న తోటి సీనియర్ సిటిజన్స్

## సీనియర్ సిటిజన్స్‌కు ప్రభుత్వం వసతులు కల్పించాలి

### ఎల్బీనగర్ నియోజకవర్గం కమిటీ అధ్యక్షులు వెంకట్ రెడ్డి

### మాధవరం సెరినిటి అపార్ట్మెంట్ నివాసితుల సీనియర్ సిటిజన్స్ నూతన కమిటీ

కర్మన్ ఘాట్, ఫిబ్రవరి 25(ప్రభాత ఉదయం) సీనియర్ సిటిజన్స్ కు ప్రభుత్వం వసతులు కల్పించాలని సీనియర్ సిటిజన్స్ ఎల్బీనగర్ అసెంబ్లీ నియోజకవర్గం కమిటీ అధ్యక్షులు వెంకట్ రెడ్డి కోరారు. ఆదివారం ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలోని కర్మన్ ఘాట్ గల మాధవరం సెరినిటి అపార్ట్మెంట్ రెసిడెంట్ సీనియర్ సిటిజన్స్ రెండవ వార్షికోత్సవం,నూతన కమిటీని సభ్యులు ఎన్నుకున్న కార్యక్రమంలో మాధవరం శేరినిటి రెసిడెంట్ అసోసియేషన్ అధ్యక్షులు శశివర్ధన్ రెడ్డి ,ప్రధాన కార్యదర్శి అనిల్ రెడ్డి ల తో కలిసి ఆయన పాల్గొన్నారు . అసోసియేషన్ అధ్యక్షులుగా సముద్రాల ధనుంజయ్, ఉపాధ్యక్షులుగా బండారు జనార్ధన్, ప్రధాన కార్యదర్శిగా అర్రడి దివాకర్ రావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా మామిడి రాంబాబు, కోశాధికారిక ఆర్ వెంకట్ రెడ్డి, సభ్యులుగా ఆర్ వెంకటేశ్వర్ రావు, ఎన్ రవీందర్ గౌడ్, జి దామోదర్, దీపక్ షా, జి సత్యనారాయణ, సలహాదారులుగా విష్ణువర్ధన్ రెడ్డి డాక్టర్ శేషయ్య గుప్తా లు ఎన్నికయ్యారు.

**ఘనంగా సీనియర్ సిటిజన్స్ జన్మదిన వేడుకలు**

అపార్ట్మెంట్ సీనియర్ సిటిజన్స్ బి జనార్ధన్, వి నారాయణ, కృష్ణమూర్తి, ఓ ప్రభాకర్, పి నరసింహారెడ్డి, పి రమేష్ గుప్తా, ఎం సంజీవరెడ్డి, జి సత్యనారాయణ ల జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. సీనియర్ సిటిజన్స్ జన్మదిన వేడుకలు జరుపుకుంటున్న వారికి సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాధవరం శేరినిటీ రెసిడెంట్ అసోసియేషన్ అధ్యక్షులు శశివర్ధన్ రెడ్డి మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్ కు నిత్యం అవసరమయ్యే అన్ని సదుపాయాలు అసోసియేషన్ కల్పించడానికి కృషి చేస్తుందన్నారు., ఈ కార్యక్రమంలో మాధవరం సెరినిటి నివాసితుల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అనిల్ రెడ్డిలు, సీనియర్ సిటిజన్స్ నల్గొండ జిల్లా కమిటీ అధ్యక్షులు సముద్రాల మల్లికార్జున్ లు పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.